రాధికా కృష్ణ

శంఖవరం సరోజా సింధూరి

సోయగాల సంధ్య మేనిపైకి ఎర్రని, సన్నని మేలిముసుగుల్ని అదేపనిగా విసురుతోంది. మందార వర్ణపు గోధూళి. గత గాథల్ని తవ్విపోసి పురాతన రాగాల్ని వెలికితీసి ఆపకుండా ఆలపిస్తోంది పరిమళాల చిరుగాలి.

దూరంనుండీ దగ్గరవుతున్నదు చిరుమువ్వల సవ్వళ్ళు. గంతులేస్తూ ఇళ్ళకు మళ్ళుతున్నాయ్ ఆలమందలు

వాటి వెనగ్గా కబుర్లాడుకుంటూ నడుస్తున్నారు గోపాలకులు.

ఏడీ... కృష్ణయ్య? సూర్యోదయంతో లేచి వెన్నముద్దలు నంజుకుంటూ పెరుగు బువ్వతిని గోవుల్ని తోలుకెళ్ళిన నల్లనయ్య వీళ్ళలో కనబడడే!

"ఏయ్ నిన్నే... ఎక్కడా మురళీధరుడు? చెలికాడ్ని వదిలేసి వస్తున్నావా?"

"నీ కోసమే కదటమ్మా రాధికా... మాతో మాట మాత్రమైనా అనక దొంగలా మాయమై యమునకేసి వెళ్ళాడు."

నిజమా! నా ప్రభువు నాకోసం యమునకేసి వెళ్ళాడా!

అరెరె!... ఏమిటింత సందళ్ళు గుండెల్లో... పూదేనెల్లో తడిసిన పరాగ రేణువులు ఒడలంతా సరాగాలాడినట్టు ఎందుకింత జలదరింత!

ఏమి పాదాలోనమ్మ... మరీ నాజూకు పోతున్నాయి. అడుగులు త్వరగా పడవే! ఏమిటే చిరుగాలీ! యమున మీంచేనా వీస్తున్నావ్? నువ్వు మోసుకొచ్చే నీటి తుంపర్లకు నాతాపం చల్లారుతుందటే... నా ప్రాణప్రియుడి అధరాల మధువుల చినుకులకేగాని!

ఏడీ... ఎక్కడా నారేడు? యమునా తటి వెలవెలబోతోందెందుకనీ?

"యమునా! నా ప్రియుడు నాకోసం ఇటుకేసి వచ్చాడని విన్నానే. నువ్వుగాని చూశావా? కాస్త వైనం తెలిపి పుణ్యం కట్టుకో."

"ఎవరమ్మా రాధికా నీ ప్రియుడు? ఇంతలేసి కన్నులున్న ఆ నల్లని వాడేనా! ఊరికూరికే నా కెరటాల కుచ్చిళ్ళలాగి అల్లరి పెడుతున్నాడు. కాస్తంత కసురుకున్నాను అంతే.. నా వేడికోళ్ళు విన్పించుకోకుండా అలిగి వెళ్ళిపోయాడమ్మా ఆ వెదురు పొదల్లోకి."

అయ్యో! ఆ వెదురు పొదల్లో నడిస్తే కందిపోవా నా ప్రభుని పదపల్లవాలు! ఎంతపని జరిగిందీ... తప్పంతా నాదే. మరి కాస్త ముందు నేనిక్కడకు చేరుకుని వుంటే అతగాడి కింత కష్టం వచ్చివుండేదా!

"ఓ... వెదురు పొదలారా! మా వేణుగాన లోలుడు అలిగి ఇటదాగినాడని యమునమ్మ చెప్పింది. చూపండమ్మా నా హృదేశుడ్ని."

"ఏం చెప్పాలమ్మా రాధికా... నీ సఖుడు మరీ తుంటరివాడై పోతున్నాడు. మా తనువంతా తడిమి కితకితలు పెడుతుంటే కాసింత కవ్వింజేశాం. అంత మాత్రానికే మూతి ముడుచుకునీ అదుగో ఆ పొన్నపూల పొదరిళ్ళవైపు సాగిపోయాడమ్మా ఆ గ్రంథ సాంగుడు."

హు... ఎక్కడా నిలువనీరే నా కృష్ణయ్యని. ఎంతగా కష్టపెట్టుకున్నాడో వెన్నలాంటి మనసును! నా ఒడిలో తప్ప సేదతీరదే అతగాడి హృదయం!

ఎంత నడిచినా రావేమిటి పొన్నపూల పొదరిళ్ళు... అబ్బ! కాలికేదో తగిలిందే! గులకరాయి గుచ్చుకుంది. రక్తం పోతోంది. పోనీ... నా కన్నయ్య మనసుకయిన గాయం కంటేనా... ఎన్ని ఎదురు రాళ్ళు కొట్టుకుని నా అడుగులెర్రబడ్డా లెక్కచేస్తానా!

అదుగో... ఎక్కడో... దూరంగా... మాధవుడూదే పిల్లన గ్రోవి. అవును ఆ చిలిపివాడే. అది మురళీరవం కాక మరేమిటి? పొన్నపూల పొదరిళ్ళలోంచే వినబడుతోంది.

"ఎక్కడమ్మా మురళీలోలుడు? కనుమరుగై వినబడుతున్నాడు. ఎంత తియ్యటి గానం... పాల మీగడలు జుర్రుతున్నట్టూ"

"ఏమిటమ్మా రాధికా... విలబడే పలవరిస్తున్నావ్. ఇది మురళీగానం కాదే మాధవీ... పూపొత్తిళ్ళలో మత్తిల్లి పాడుతున్న కోకిల కుహూజితం."

"అతడి తలపులో మునిగి ఏది ఏదో కూడ కానగలేకున్నాను. పొన్నపూ తరువులారా! వేగిరం అతడి జాడతెలిపి నన్ను వూరడించండమ్మా."

"ఇంతదనుకా ఇక్కడే వున్నాడమ్మా. మా చెక్కిళ్ళు గిల్లుతూ... అధరాలమీద పంటిగాట్లు పెడుతుంటే గారంగానే కసిరాం. చెట్టెక్కి కూర్చునీ బెట్టుపోయాడమ్మా మన్నించమని ప్రాధేయపడినా వినకుండా చక్కా పోయాడు ఆ ఎలమావి తోటల్లోకి."

ఎన్ని బాధలొచ్చాయి నంద కిశోరా నీకు! ఒక్కసారి నిన్ను నా హృదయానికి హత్తుకుని వూరడించేవరకు నాకనుదోయి వర్షించడం మానేట్టులేదే! నా ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో నిన్ను వూయలూపి జోలపాడందే నావేదన తీరేట్టులేదే!

"ఎలమావి కొమ్మలారా! మాలతీ లతల్లారా! చెంగల్వ పూదండలు ధరించిన ఒక చిన్నవాడు ఇటు వచ్చాడు చూశారా? శిఖిపింఛాన్ని సిగలో ముడుచుకున్న ఆ మోహనాకారుడ్ని ఎక్కడే దాచారు? దయచూపి నా మానసచోరుడ్ని నా కివ్వండమ్మా."

"నువ్వేనటమ్మా రాధికంటే... వినూ నీకొంటె క్రిష్టుడు చేసిన నిర్వాకం. ఆ మాలతి కొంగు పట్టుకులాగాడా... ఈ మల్లికపై మత్తు చల్లాడు. అదుగో ఆ మందార మాలను కన్నుగీటి... ఆ సంపెగను సందిట్లో బంధించబోయాడు. ఎంతటి రసికుడమ్మా నీ ప్రియుడు! ఎన్నో ఏళ్ళనాటి ఎలమావి మాను కదా..

ఏదో పెద్దదాన్ని... ఇది నీకు తగునటయ్యా అని మందలించానని అలిగిపోయాడే నీ వాడు. అమ్మో! ఎంత బెట్టు సరనీ యమునకే వెళ్ళుంటాడు. పోయి చూడవమ్మా రాధికా."

వీళ్ళంతా నల్లనయ్య మీద చాడీలు చెప్పటానికేనా పుట్టారు! అందరాని జాబిల్లి అతగాడనీ అసూయకాబోలు! తిరిగీ యమున దరికే పోయి ఎదురు చూడాలేమో!

"తెలిసిందా రాధికా.. నీ ప్రియుని జాడ?"

అడుగుతూన్న యమునకు ఏమని చెబుతుందీ? అతగాడికై వెదికి వేసారి పోయినా జాడ తెలియరాలేదంటే నవ్వదూ యమునమ్మ నన్ను చూసి!

కృష్ణా! వెన్నెల్లో తడిసినా ఇసకతిన్నెలేమిటి అగ్నివేదికల్లా మండిపోతున్నాయి? నా నయనాల నుంచి రాలి కపోతాల మీదుగా ప్రవహిస్తున్న అశ్రువాహినులు వెచ్చని వూర్పుల వడగాల్పులకు ఆవిరైపోతున్నాయ్. నీ కోసమని హరిచందనాలు అలదుకొన్న నామేను విరహతాపంతో వేగిపోతోంది. పుట్టు గోరింటల పెదవి ఎరుపులు రంగులుపూసి వెలవెలపోతున్నాయి.

ప్రియా! వడినిండా స్వప్నాలను పోసుకుని వచ్చాను.. నీకు పాన్పువేద్దామని వయసు కర్పూరాన్ని కొంగున ముడివేసుకుని తెచ్చాను... నీకు వలపు హారతి ఇద్దామని అన్నీ వ్యర్థమేనా!

ప్రభూ! నా కళ్ళు కన్నీళ్ళలో తడిసి మంకె నంవ్వాల్సిందేనా? నీ కోసం స్పందించే నా హృదయం నిన్ను చూడకుండానే ఆగిపోదు కదా!

అరె! ఎక్కడా... మోహన మురళీరవం... గాలి అలల్లోంచి తేలివచ్చి నా అణువణువునూ స్పృశిస్తూ... నా హృదయాంతరాళాన్ని పట్టికుదిపేస్తూ...

అది రాధకోసం మాధవుడూదే మువ్వల వేణువేకదూ! ఆ... నా కళ్ళ నెవరూ దొంగలా మూసి దోబూచులాడుతున్నారు!

కన్నయ్యే... అవును... ఆ వలపుదొంగే.

"నల్లనయ్యా! విన్నావా ఈ రాధిక మూగపిలుపు ఏదీ నీ ముద్దుమోము ఒక్కసారి నా గుండెలకు

కృష్ణా! వెన్నెల్లో తడిసినా ఇసకతిన్నెలేమిటి అగ్నివేదికల్లా మండిపోతున్నాయి? నా నయనాల అశ్రువాహినులు వెచ్చని వూర్పుల వడగాల్పులకుఆవిరైపోతున్నాయ్ .నీకోసమనిహరిచందనాలు అలదుకొన్న మేను విరహతాపంతో వేగిపోతోంది.

హత్తుకోనీ అందరూ నిన్ను కసిరికొట్టారలు. అలిగిన నీ ముఖారవిందాన్ని తనువారా చుంబించనీ.

రా! నా ఒడిలో సేదతీరు. నీకోసం నా గుండెల్లోంచి ఎన్ని కన్నీళ్ళు పొంగాయనీ... పరవాలేదు... రాలిన ప్రతి కన్నీటిబొట్టూ నీ రాకతో పన్నీరుగా మారిందయ్యా.''

''రాధికా! ఇంతవరకూ నిన్ను వదిలి ఎక్కడున్నాననీ అడగవేమి? నే వేసిన కొంటె వేషాలకు కళ్ళెర్రజేసి ప్రశ్నించు. అల్లరి చిల్లరి పనులెందుకు చేశావనీ ఈ ఆకతాయిని నిలదీసి మందలించు. నీ కుసుమకోమల హస్తాలతో నన్ను శిక్షించు.''

''ఎంతటి వెర్రివాడవయ్యా క్రిష్ణయ్యా. ఇంతసేపూ నా హృదయంలోనే వుండి ఎక్కడో వున్నానంటావే! నా స్వప్నాల్లో దూరి నన్ను కవ్విస్తూ నువ్వేసిన కొంటె వేషాల్ని సిగ్గువిడిచి ఏమనీ అడగమంటావ్? ఊహల్లో నా పెదవుల్ని ముని పంటనొక్కుతూ... పయ్యెదతో సయ్యాటలాడుతూ నువ్ చేసిన అల్లరి చిల్లరి పనులు నా నోటితో చెప్పించాలనా చూస్తున్నావ్. చాలునయ్యా... గొప్పవాడివే.''

''ఎంతటి నిష్కల్మష హృదయునివి రాధికా స్వచ్ఛమైన నీ ప్రేమకు అసూయపడైనా తెలుసా ప్రేయసీ! ఎన్ని వాడీలు ఎన్నా నీలో ఈర్ష్యాద్వేషాలు తలెత్తలేదంటే నీ అనురాగం ఎంత సత్యం! నన్ను తప్ప ఎవరినీ చూడని... నా పిలుపు తప్పమరేమీ వినని నీ ధ్యానం ఎంత మహోన్నతమైనది. అందుకే నా ప్రాణప్రియా! ఈ కృష్ణుడెప్పుడూ రాధికా కృష్ణుడే.''

''ధన్యురాల్ని స్వామీ! ఈ క్షణాన నీలో ఐక్యమైపోతున్న నన్ను ఇక ఎన్నటికీ విడదీయకు.''

*